## క్లుప్తంగా

### రమ్య సుచరితకు డాక్టరేట్



నయీంనగర్: హనుమకొండ నగరానికి చెందిన ఇమ్మడి రమ్య సుచరిత డాక్టరేట్ అందుకున్నారు. చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ నరసింహ ఆధ్వర్యంలో 'సింథసిస్ అండ్ బయాలజికల్ ఎవల్యూయేషన్ ఆఫ్ నోవెల్ ఫ్యూజ్డ్ 1,2,3 – ట్రయజోల్స్'పై సుచరిత పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనలో యాంటీ క్యాన్సర్, యాంటీ బ్యాక్టీరియల్ అణువులను కనుగొన్నారు. ఈమేరకు ఆమెను యూనివర్సిటీ కులపతి సీహెచ్.పురుషోత్తం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్.సాత్విక్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

### 'కాంగ్రెస్ ఫ్లెక్సీల చించివేత



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చించివేశారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను చించివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులే ఈఘటనలకు పాల్పడి ఉంటారని, ఓటమిని భరించలేక కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలు చించివేశారని వారు ఆరోపించారు.

### ఎన్పీడీసీఎల్ సీఎండీకి అభినందనలు



కాజీపేట అర్బన్: ఎన్పీడీసీఎల్ సీఎండీగా విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ కంపెనీ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎండీని యూనియన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శులు, శ్రీనివాస్, ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

ఎంజీఎం: డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌గా డాక్టర్ రవీంద ర్‌నాయక్‌ను నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు టీజీపీఏ రాష్ట్ర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బీ.త్రివేణికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి టీజీపీఏ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ పక్షాన ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో నెలకొన్న పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

### రక్తదాన శిబిరానికి స్పందన

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు శివారులోని పాత్‌ఫైండర్ ఫార్మసీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్ రావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. హనుమకొండ ప్రతిమ దిలీప్ ఆస్పత్రి వైద్యులు 56యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసిఫ్ హుస్సేన్, డాక్టర్ సతీష్, నిశాంత్‌రావు, ముకుందారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు అయ్యప్ప నగర సంకీర్తన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6గంటలకు అయ్యప్ప నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ గురుస్వామి తెలిపారు. ఈమేరకు వరంగల్ రంగశాయిపేట సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవా పరపతి సంఘం సభ్యులతో కలిసి నగర సంకీర్తన, 23న అయ్యప్ప పడిపూజ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ రంగశాయిపేట పురవీధుల్లో గురువారం సాయంత్రం 6గంటలకు అయ్యప్ప నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు వివరించారు. 23న రంగశాయిపేట సీతారామచంద్ర స్వామి ఆలయం ప్రాంగణంలో శబరిమలైని తలపించేలా అయ్యప్ప పడిపూజను నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



మెడికేర్ ఆస్పత్రిలో క్రిస్మస్ వేడుకలు



మడికొండ: కేక్‌కట్ చేస్తున్న జంగా రాఘవరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట రూరల్: ప్రీ క్రిస్మస్ వేడుకలను నగరవ్యాప్తంగా ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని మెడికేర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఫాదర్ కొలంబో వైద్య కళాశాల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. కాజీపేట ఫాతిమానగర్ లోడి సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి, వైద్య కళాశాల డైరెక్టర్ ఫాదర్ తరుణ్‌రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నప్పరెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించి, క్రీస్తు జన్మదిన సందేశం చేసి క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ కొలంబో నర్సింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ రాజిరెడ్డి, మెడికేర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేందర్ రెడ్డి, ఫ్యాకల్టీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**రాంపూర్‌లో..**

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధి 46వ డివిజన్ రాంపూర్‌లోని అక్షయ గ్రేస్ మినిస్ట్రీస్‌లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరయ్యారు. సల్మాన్ – అనిత దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాఘవరెడ్డి పాల్గొని కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేసు ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, భిక్షపతి, శ్రావణ్‌రెడ్డి, దాసు, నవీన్ యాదవ్, శివ, గోపి, కోబ్రా పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ కార్యాలయంలో..**

కాజీపేట అర్బన్: బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్.. తన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ప్రతి ఏడాది క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటామని చెప్పారు. తమతో పాటు సమాజాన్ని ప్రేమించాలని యేసు క్రీస్తు ప్రభువు తన సూక్తుల్లో తెలియజేశారని గుర్తుచేశారు. కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, సోదా కిరణ్, నాయకులు పులి రజనీకాంత్, సిద్దోజ్ రమేష్, దానం, ఇస్సాక్, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 'నాగ సాయి చంద్ర' సేవలు మరువలేనివి



బ్యాగులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

హన్మకొండ అర్బన్: నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు మరువలేనివని సెక్టోరియల్ అధికారి రాధ అన్నారు. నగరంలోని వడ్డేపల్లి ప్రాంతంలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు ఎస్.చంద్రమోహన్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు, బ్యాగులు, దుప్పట్లు, శానిటేషన్, తదితర వస్తువులను బుధవారం అందించారు. ముఖ్యఅతిథులుగా సెక్టోరియల్ ఆఫీసర్ రాధ, హనుమకొండ, కాజీపేట ఎంఈఓ రామకిషన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రంలోని పిల్లలకు సుమారు రూ.25 వేలు వెచ్చించి వస్తువులను అందించడం వారి సేవా గుణానికి నిదర్శనమన్నారు. అనంతరం హాసిని చిట్ ఫండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చిట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.కిరణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రామ్‌నివాస్ స్వీట్ హౌజ్, స్వాగత్ స్వీట్ హౌజ్ నిర్వాహకులు తోడ్పాటునందించారు. కార్యక్రమంలో విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ పొట్లపల్లి శ్రీనివాసరావు, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్, కోర్ కమిటీ సభ్యులు కేవీ.రంగారావు, కోర్ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులు, పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నాయకుడు బస్వరాజ్ శ్రీమాన్ హాజరై సరోజన యాదవ్‌తో కలిసి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సింగారపు అరుణ, ధనలక్ష్మి, లక్ష్మి, అభిరామ్, జ్యోతి పాల్గొన్నారు.

### కల్లాపి చల్లి గొబ్బెమ్మలు పెట్టాలి



కాజీపేట: ధనుర్మాసంలో ప్రతీ ఇంటి ముంగిట కల్లాపి చల్లి వరి పిండితో ముగ్గులు వేయడం ఆనవాయితీగా వస్తోందని అర్చకుడు అయినవోలు సాయికృష్ణశర్మ తెలిపారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని బుధవారం ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసంలో ఆవు పేడతో గొబ్బెమ్మలు తయారుచేసి, పసుపు, కుంకుమ, తిలాలు, రేగుపండ్లు, ఉత్తరేణి ఆకులతో అలంకరించి ఇంటి పెట్టాలని సూచించారు. వృషభ, పశు పూజల్లో భాగంగా గంగిరెద్దులను తిప్పడం, హరిదాసుల కీర్తనలతో పండుగ సందడి నెలకొంటుందని వివరించారు.

## అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. వరంగల్‌లోని సెంట్రల్ జైల్‌ను ఎందుకు కూల్చారని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించారని, శిథిలావస్థలో ఉన్న జైలును తమ ప్రభుత్వం కూల్చిందని అన్నారు. రూ.1100 కోట్లతో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, సోదా కిరణ్, నాయకులు పులి రజనీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

కాజీపేట: కాజీపేట పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. మండల దీక్షలు చేపట్టిన అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో శ్రీధర్మ శాస్త్రాకు ప్రత్యేక అభిషేకం, అర్చన, అలంకరణ జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు.. ప్రత్యేక అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

## శిల్ప కళాసంపద వెరీ బ్యూటీఫుల్

- కోటను సందర్శించిన అమెరికా, పోలాండ్ దేశస్తులు



శిల్ప కళా సంపదను తిలకిస్తున్న అమెరికా, పోలాండ్ దేశస్తులు

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్పకళా సంపద వెరీ బ్యూటీఫుల్ అని అమెరికా, పోలాండ్ దేశస్తులు కొనియాడారు. వరంగల్ పర్యటన సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయా దేశాల పర్యాటకులు సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని నల్లరాతి శిల్ప కళాఖండాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలతోపాటు ఏకశిల చిల్డ్రన్ పార్కు, గుట్ట, ఖుష్‌మహల్‌ను సందర్శించారు. అంతకుముందు కాకతీయుల విశిష్టత, చారిత్రక కట్టడాల గురించి పర్యాటక శాఖ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్ వివరించారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోఆర్డినేటర్ అజయ్, సిబ్బంది ఉన్నారు.

### డీజిల్‌కాలనీలో మహాపడి పూజ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 14వ మహాపడి పూజా కార్యక్రమంలో డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం 400మంది అయ్యప్ప మాలధారులకు భిక్ష చేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు డీఎంఈ అంకిత్ టీ.కాడే, ఏడీఎంఈలు భానుప్రకాష్, నాగరాజశేఖర్, ఏసీఎంటీ రవీంద్రకుమార్, గురుస్వాములు శివశంకర్, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, జెరుపోతుల వెంకన్న, హేమంత్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గంగదేవిపల్లి గ్రామ సందర్శన



జీపీ కార్యాలయం ఎదుట విద్యార్థులు, సర్పంచ్ మల్లారెడ్డి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలోని కృష్ణవేణి హైస్కూల్ వైస్ చైర్మన్ వీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నేతృత్వంలో వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గంగదేవిపల్లి ఆదర్శ గ్రామాన్ని విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోనె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కూసం రాజమౌళితో కలిసి గ్రామ పరిసరాలను విద్యార్థులు పరిశీలించారు. అంతర్గత రోడ్లు, పరిసరాల పరిశుభ్రత, పచ్చని గ్రీనరీ, మొక్కల పెంపకం గురించి తెలుసుకున్నారు. పొదుపు సంఘాల పనితీరు, మిషన్ భగీరథ నీళ్లు, విద్య, వైద్యం, గ్రామాభివృద్ధిపై వారికి సర్పంచ్ వివరించారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా గంగదేవిపల్లి గ్రామాన్ని విద్యార్థులు సందర్శించారని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఇనుగాల జోగిరెడ్డి, రేణుకాదేవి, అజ్మద్, కుమారస్వామి పాల్గొన్నారు.

### శబరిమలకు పాదయాత్ర

మడికొండ: పాదయాత్ర ద్వారా శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రాంపూర్ గ్రామానికి చెందిన రాంచందర్ గురుస్వామిని పలువురు అయ్యప్ప మాలధారులు బుధవారం కలిశారు. ఈమేరకు ఆయనను పట్టు వస్త్రాలతో సత్కరించారు. రైలు మార్గం ద్వారా 1,600 కిలోమీటర్లు కాగా, పాదయాత్ర ద్వారా 2,400 కిలోమీటర్లు నడిచి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నట్లు రాంచందర్ వివరించారు. కార్యక్రమంలో శివశంకర్, దండిగం సతీష్, గురుస్వామి భాస్కర్ రెడ్డి, వెంకన్న, బాబు, శీలం రమేష్, హేమంత్, టీవీ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



రవి (ఫైల్)

కాశిబుగ్గ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ – కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా జులైవాడకు చెందిన దేశెట్టి రవి(49) టైలర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది తను చనిపోతున్నానని తన మేనల్లుడికి మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా: కాశిబుగ్గ జీడబ్ల్యూఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట గుర్తుతెలియని 55 – 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి చేర్చి భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

### 12లీటర్ల గుడుంబా స్వాధీనం

ఖిలా వరంగల్: గుడుంబా, మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి 12లీటర్ల గుడుంబా, 3 బీరు బాటిళ్లు, ఇతర మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఖిలా వరంగల్ మండల పరిధి గుంటూరుపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పత్తి చిట్టమ్మ ఇంట్లో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సై రేష్మా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

## కోటలో పర్యాటకుల సందడి



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటకు పలు పాఠశాలల విద్యార్థులు, పర్యాటకులు బుధవారం భారీగా తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడుతూ సందడిగా మారింది. ఈ సందర్భంగా వారు శిల్పాల ప్రాంగణంలోని శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను తిలకించారు. శిల్పకళా సంపద, కాకతీయుల విశిష్టతను వారికి గైడ్ రవియాదవ్ వివరించారు. అనంతరం ఏకశిల చిల్డ్రన్స్‌పార్క్‌లోని చెట్లనీడన పర్యాటకులు సేదతీరారు. కార్యక్రమంలో టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ సాహస శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ రమేష్, నారాయణ

కేయూ క్యాంపస్ : హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈనెల 23 నుంచి నిర్వహించబోయే జాతీయ సాహస శిబిరానికి కేయూ జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) వలంటీర్లను ఎంపిక చేశామని కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ బుధవారం తెలిపారు. టి.విగ్నేష్( ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ), ఎస్.సాయిరామ్, ఎ.కావేరి (కిట్స్, హనుమకొండ), జంపన్న(టీటీడబ్ల్యూ ఆర్‌డీసీ, మణుగూరు), బి.హరినివాస్ (రంగశాయిపేట ప్రభుత్వ కళాశాల, వరంగల్), ఎస్.లక్ష్మీనారాయణ (కేయూ ఇంజనీరింగ్ కోఎడ్యుకేషన్ కళాశాల), టి.అంజలీదేవి, ఎస్.శివాని( కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల), డి.లక్ష్మీప్రసన్న (ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల, హనుమకొండ), బి.స్రవంతి(వివేక వర్ధిని డిగ్రీ కళాశాల(మంచిర్యాల) ఉన్నారు. వీరికి కాంటిజెంట్ లీడర్‌గా షరీఫ్‌బేగం ఉంటారని నారాయణ తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అభినందించారు.

## ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ ఆవిర్భావంలో నాయకులు

మడికొండ: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని 46వ డివిజన్ రాంపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1925, డిసెంబర్ 26వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ పట్టణంలో పార్టీ ఆవిర్భవించిందని వివరించారు. దేశవ్యాప్తంగా దున్నేవానికే భూమి కావాలని భూపోరాటాలు నడిపిన ఏకైక పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతంలో నైజాం వెట్టిచాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా, దొరల గడీలనుంచి విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత పార్టీదేనని కొనియాడారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా సీపీఐ ముఖ్య భూమిక పోషించిందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, పార్టీ జిల్లా సమితి సభ్యులు రాసమల్ల దీన, మాలోతు శంకర్, రాజమణి, బొట్టు భిక్షపతి, మంద సుమన్, మునిగాల వెంకటయ్య, స్వామి, లక్ష్మి, పద్మరాజు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జాల నుంచి నగరాన్ని కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక నాయకులు

హన్మకొండ అర్బన్: నగరంలోని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములు, గుట్టలను ఆక్రమిస్తున్న భూకబ్జాదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు అదనపు కలెక్టర్ మహేందర్‌జీని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ భూములు, గుట్టల స్థలాలను సర్వే చేయించాలని, ఆక్రమణలకు తెగపడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిరాజు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న కవిత

హసన్‌పర్తి: చిరుధాన్యాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత అన్నారు. హసన్‌పర్తి మండలం చింతగట్టులో ఆరోగ్యంపై మహిళలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటి తయారీ గురించి వివరించారు. చిరుధాన్యాల వాడడం వల్ల బీపీ, షుగర్‌తో పాటు అనేక రకాల వ్యాధులు దరి చేరవని చెప్పారు. చిరుధాన్యాల వినియోగంపై ఉచిత సలహాల కోసం 91003 73129 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. రికార్డ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వనిత, మంజుల, ఆశ పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గం



ఇరిగేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు



టీఎన్జీవోస్ హసన్‌పర్తి కమిటీ సభ్యులు

హసన్‌పర్తి: ఇరిగేషన్ ఫోరం హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ప్రధాన కార్యదర్శి సోమయ్య ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా జీ.రాజేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ హమీద్, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్, సభ్యులుగా అనూప్, నారాయణ, ఇల్యాజ్, సరస్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీ.రాజేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు శ్యాంసుందర్, ఎండీ.మొయిజ్, రామునాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్ ఖన్నా, దివాకర్‌రెడ్డి, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**టీఎన్జీవోస్ హసన్‌పర్తి యూనిట్ కార్యవర్గం**

టీఎన్జీవోస్ హసన్‌పర్తి యూనిట్ నూతన కార్యవర్గాన్ని చింతగట్టు అతిథి గృహంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ హసన్‌పర్తి యూనిట్ అధ్యక్షుడిగా అనంతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మహేందర్‌రెడ్డి, రమ్యకృష్ణ, మంజుల, కల్పన, భరత్, చుంచు శ్రీనివాస్, స్వప్న, స్వరూప, శివ, సంతోష్, అల్తాఫ్, కే.సత్యనారాయణ, దయాకర్, ప్రభ, రవి, నవీన్, అనిల్, దేవిక, పద్మావతి ఎన్నికయ్యారు. పుల్లూరి వేణు, రాజేష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ప్రధాన కార్యదర్శి సోమయ్య పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.

## క్యాన్సర్ బాధితుడికి ఉచిత వైద్యం



బాధిత కుటుంబానికి హామీ ఇస్తున్న సురేఖ

కాజీపేట: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తి చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన మహమ్మద్ నసీమ్, హైమద్ దంపతుల చిన్న కుమారుడు ఎండీ.ఆదిల్ హైమద్.. బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆదిల్‌కు సరైన వైద్యం చేయించలేకపోతున్నట్లు మంత్రి సురేఖను బాధిత కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి కలిసి కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఆ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వమే ఉచిత వైద్యం చేయిస్తుందనే హామీని వారికి మంత్రి ఇప్పించారు.